

# లౌకికులు

ఆరికెపూడి (కోడూరి) కౌసల్యాదేవి

"ఈ నెల ఎనిమిదవ తారీఖున సర్వేశ్వర్రావు ఈ వూరొస్తున్నాడట కమలా."

అతి సంతోషంగా వచ్చాడు సీతాపతి యింటికి. ఒక్కసారి తలెత్తి చూచి, తిరిగి తాను చేస్తూన్న ఉప్మా తయారీలో నిమగ్నమైపోయింది కమల.

దుస్తులు మార్చుకుని లుంగీ చుట్టుకుని, బాత్‌రూమ్‌కు వెళ్తూ ఒక్కసారి వంటగది ముందు ఆగి మరలా చెప్పాడు సీతాపతి.

"ఆ రోజు ఊరిచివర మైదానంలో పబ్లిక్ మీటింగ్ జరుగుతుందట, నగర పురపాలక సంఘం తరఫున. తర్వాత పురప్రముఖులందరితో విందు. మర్నాడు రోటరీక్లబ్‌వారి సమావేశమూ, విందూ ………"

"ఆ తర్వాత అనాథాశ్రమం సందర్శనా, భూరి విరాళమూ, తర్వాత కొండొక భవన నిర్మాణానికి పునాది వేయడమూ, మరొక ప్రముఖసంస్థ ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘ దురాచారాలను దుయ్యబట్టడమూ, అంతకు ముందో—లేక పిమ్మటనో మహిళాసమాజ సందర్శనా—అక్కడ మన ప్రగతిని గురించిన ప్రశంసా, సంస్కృతిని గురించిన సదభిప్రాయ ప్రకటనా. తర్వాత రైలో విమానమో ఎక్కి ఘనమైన వీడ్కోలుతో తుర్రుమనడం!" సీతాపతి విస్మయంగా చూశాడు కమలను.

"ఔను కమలా. అంతే, అచ్చంగా అంతే. కానీ నీకెలా తెలుసూ యివన్నీ?"

మహాజ్ఞానిలా నవ్వింది కమల.

"నా కెందుకు తెలియదూ నా భర్తగారికి గల గొప్ప గొప్ప స్నేహితులు గురించి? సర్వేశ్వర్రావుగారు ఈసారి ఎన్నికలలో కూడా నిలబడి ఇదివరకు లాగే గెలిచి, ఈ తడవ మంత్రి పదవిని కూడా చేపట్టబోతున్నారని జనమందరూ అనుకుంటున్నారుగా? మీరూ చెప్పారు ఆ మధ్య."

"ఔనౌను."

కాళ్ళు చేతులూ అదరాబాదరా కడిగేసుకొచ్చి, తుడుచుకోవడం కూడా మరిచి ఉపాహార సేవనకు ఉపక్రమించాడన్న మాటేగానీ అతడి ఆలోచనలన్నీ మిత్రుడు సర్వేశ్వర్రావు చుట్టూనే తిరుగుతున్నాయి.

"కమలా! నా కొల్లీగ్స్ అంతా 'సీతాపతి భలే అదృష్టవంతుడవోయ్! అంత గొప్ప వ్యక్తికి స్నేహితుడవు!' అని నన్ను చాలా ఎక్కువగా చూస్తారు తెలుసా?"

కాఫీలు కలుపుతూన్న కమల మాట్లాడలేదు.

"నేనూ సర్వేశ్రావూ క్లాస్‌మేట్సుమే గాక, హాస్టల్‌లో ఒకే గదిలో వుండే వాళ్ళమని నిన్న చెబితే క్రొత్తగా వచ్చిన అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసరు మూర్ఛపోయినంత పనిచేశాడు తెలుసా?"

ఆ సంగతి జ్ఞాపకంవచ్చి పకపకా నవ్వుతూన్న సీతాపతి కమల తనతో శృతి కలపకపోవడం చూచి విస్మయంగా చూశాడు.

"కమలా! ఏమిటా పరధ్యానం?"

"లేదే! వింటున్నాను."

"కాదు. నా మాటలు నీకు రుచిగా లేవు."

"హుఁ! మీ కెలా తెలుసు?"

"మరి నవ్వవేం? గృహిణిగా ఒక్క బాధ్యతగల మాట అయినా మాట్లాడావా? నా స్నేహితుడిని ఒక్కపూట మన యింటికి పిలవాలని అన్నావా?"

కమల నిదానంగా చూసూ మెల్లగా మాట్లాడింది. "అది నిర్ణయించుకోవలసింది మీరు. మీరు చెప్పిన పని నా బాధ్యత మేఱకు నేను చేయడమే నావంతు."

"నా స్నేహితుడు అంత గొప్పవ్యక్తి అయినందుకు నీకు గర్వంగా లేదూ? అతడిచ్చే వుపన్యాసానికి ప్రజలు ఎక్కడికక్కడ మంత్రముగ్ధులైపోయి నిశ్శబ్దంగా అనందంగా గౌరవంగా వింటారు. తెలుసా? ఈసారి అతడి వుపన్యాసం ఈ వూళ్ళోనే గనుక నువ్వూ విందువుగాని, మెచ్చుకుంటావు."

"ఏదో చేద్దాంగానీ........"

"అదిగో. ఏమిటలా తీసిపారేస్తావ్ అంత గొప్ప వ్యక్తిని?"

"తీసి పారేసేపని నాకేంగానీ, మీలాగా ఇతరులకు వంచి పాడలేను. మనంత వాళ్ళం మనం. మీరూ తక్కువేం కాదు; ఒక కంపెనీకి మేనేజర్ మీరు!"

"అహ్హహ్హహా!"

అలసిపోయేంత వఱకూ విరగబడి నవ్వేశాడు సీతాపతి. "మన మానేజర్ గిరీ, మన పేరు నామాలూ ఈ ఒక్క వీధీ, ఆ ఒక్క ఆఫీసు పరిధుల వఱకే పరిమితం. వాడిలాగా దేశమందరికీ తెలిసిన ఘనత ఎందరికుంటుంది? సర్వేశ్రావ్ ఈజె గ్రేట్‌మాన్! గ్రేట్ గ్రేట్ పర్సనాలిటీ! అఁ.... ఇంతకూ అతడిని ఒక పూట మన ఆతిధ్యం స్వీకరింపమని ఇపుడే ట్రంక్‌కాల్ చేసి చెప్తాను హైద్రాబాద్‌కు, అలాగైతే ప్రోగ్రాంలో ఇందుకు కూడా ముందే కేటాయించుకుంటే ఆరోజు ఎవరూ అడ్డువచ్చే అవకాశం వుండదు!"

ఆ రోజూ మర్నాడూ కూడా సర్వేశ్వ్రావు ఏదో మీటింగుకు వెళ్ళాడనో లేక సంఘోద్ధరణ కార్యక్రమంలో పాల్గొని ప్రొద్దుపోయాక వస్తాడనో చెప్పేడు అతడి కార్యదర్శి సీతాపతికి.

ఎట్టకేలకు మూడవనాటి రాత్రి చేసిన ట్రంక్‌కాల్ అందినది. సర్వేశ్వ్రావు స్వయంగా మాట్లాడాడు. అతి సంతోషం ప్రకటించాడు పాత మిత్రుడు తనను అంత గుర్తుపెట్టుకొని, శ్రమపడి అహ్వానిస్తునందుకు. ఆతిధ్యం స్వీకరింపగలనని అతి ఆనందంగా అంగీకరించాడు.

"చూశావా అతడి నిరాడంబరత? నేనతడిని గుర్తుపెట్టుకోవడం చాలా సంతోషమట! నిజానికి అతడి చుట్టూ తిరిగేవారిలో నాలాంటివా రెందరో? అతడికి నేను గుర్తుండడమే మహా గొప్ప!"

"ఇంతకూ ఆ ట్రంక్‌కాల్ బిల్లు ఎంత అవుతుందంటారు? చాలాసేపు మాటాడారు!"

"ఎంతైతే ఏం లెద్దూ? అంతటి మిత్రుని విషయంలో యిదొక లెఖ్ఖా రేపు ఏదైనా అవసరమైనపుడు అతడి ఒక్క సంతకం మనకెంతో ఉపకారం—వేల వుపకారం చేస్తుంది తెలుసా?"

అంతతో ఆగలేదు సీతాపతి హడావుడి. సర్వేశ్వ్రావుకు అతిధ్యమీయడమంటే మాటలా? డ్రాయింగ్‌రూమూ, డైనింగ్‌హాలూ నవ్యతను సంతరించుకోవాలి కంటికింపుగా.

సంతరించుకున్నాయి నాల్గువేలను దిగమింగి.

క్రొత్తరకపు ఫర్నిచర్ దిగింది అద్దె పద్ధతి మీద.

"ఏమిటమ్మా? చెల్లాయి కెవరైనా పెండ్లివా రొస్తున్నారా?" అనడిగాడు బయటినుండి వస్తూనే విజయ్ తల్లిని.

నిట్టూర్చింది కమల.

"పెండ్లి కెదిగిన కూతురున్నదనే విషయం మఱచి, మీ నాన్నగారుపేస్తూన్న వెట్టిగంతులు నాయనా అవి! ఇంతకూ నువ్వు వెళ్ళిన పనేమైంది?"


"ఏమీ అవ్వలేదు. నో వేకెన్సీలే ఎదురు!"

"ఏమిటి? మీ నాన్నగారి పేరు చెప్పినా కూడానా?"

"అఁ! నాన్నగారి దంతా పాత పద్ధతి! స్నేహితులైనంత మాత్రాన పనులు జరిగిపోతాయనుకుంటారు. అవతల ఎవడో ఆ పోస్టుకోసం ముప్పైవేలు గుమ్మరించుతూంటే ఈ మామూలు స్నేహితుని కొడుక్కి అప్పనంగా ఎందుకు కట్టబెడతాడు? తెలివితక్కువ వాడా ఏం? ఈ స్నేహం అతడికేం ఒరగబెడుతుంది?"

"ఔను." నీరసంగా అన్నది కమల! "మీ నాన్నగారికీ అమాయకత్వమేమిటో నాకు అర్థంకాదు. అందరూ తన వలె సత్యహరిశ్చంద్రులూ, నిజాయితీపరులూ, స్నేహానికి ప్రాణమిచ్చేవారూ అనుకుంటారు."

"తాననుకోవడమే కాదు అమ్మా! మనల్నీ అనుకోమంటారు. అందరూ ఆనాటి కానాడు పైపైకి పోతూంటే మనల్ని ఈ అదర్శాలలో అణగారిపోబెడుతున్నారు నాన్నగారు!"




"హాయ్! ఉద్యోగం వచ్చిందిరా అన్నయ్యా? మొదటి జీతంలో నాకే మిస్తావు?"

వఅద కెరటంలాగా వచ్చింది లహరి.

"అఁ అఁ. వస్తుంది– రేపు నీ కొడుకూ, ఆ తర్వాత నీ మనవఁడూ కూడ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్‌లో నమోదయ్యాక!" కినుకగా అన్నాడు విజయ్.

"హాయ్! ఇదేమిటిది? ఉన్నట్లుండి మన డ్రాయింగ్ రూం మయసభలాగా మారిపోయింది?"

"అబ్బ. వుండవే నీ కన్నీ ఆశ్చర్యా లేను! ఏదో ఈ క్రొత్త ముస్తాబులు చేసినవేళ మంచిదై నీ పెళ్ళి అయితే అంతకంటే నా క్కావలసిందేముంది?" అన్నది కమల.

"హమ్మయ్య! పెళ్ళి కావాలంటే ఇప్పుడు ఓ లక్షో, అరలక్షో కావాలి కద మన తాహతువాడు రావటానికి! అందులో పదోవంతు కూడ నీ దగ్గఅ లేదు గనుక నాకు చాల సంతోషంగా ఉంది. ఇప్పట్లో నాకు పెళ్ళయ్యే ప్రమాదం లేదు!"

"ఆగు. నే నన్నీ వింటూ నే వున్నాను!"

సీతాపతి కంఠం విని అంతా అటు చూచారు.

ఇంటిముందు ఖాళీస్థలాన్ని ఇద్దరు కూలీలతో శుభ్రంగా అద్దంలాగా చేయించు తున్నాడు అతడు, ఎనిమిదో తారీఖున వచ్చే సర్వేశ్వర్రావు తాలూకు విదేశీ వాహనం అక్కడ కొంతసేపు విశ్ర మించడానికి!

"మీ మాటలన్నీ వింటున్నానులే లహరీ! నా దగ్గఱ పదివేలు కాదు– పది లక్షలున్నా నేను కట్నం యివ్వను. తెలి సిందా! కానియ్ – అయ్యేననాటికే ఔతుంది. తొందరేం పెండ్లికి? విజయ్ తెలివిని బట్టి వచ్చిననాడే వస్తుంది ఉద్యోగం. ఎవ్వడికీ లంచం యివ్వను నేను!"

కమల కోపంగా లోనికి నిష్క్రమిం చడం చూచి, సీతాపతి పిల్లలూ గుంభ నంగా నవ్వుకున్నారు.

"ఇంతకూ ఈ సర్వేశ్వర్రావుగారు చాలా ఆదర్శ పురుషుడై వుండాలి నాన్న గారూ! అందుకే మీకు స్నేహితు లయ్యారు. ఔనా?" అనడిగింది లహరి.

"అలా అడిగారు బాగున్నది చెప్తాను వినండి...."

"అతడు మా కళాశాలలో చదివే టప్పుడే విద్యార్థులందరికీ, ఉపాధ్యాయు లందరికీ తెలిసిన వ్యక్తి. అతడు లేని యాక్టివిటీ వుండేది కాదు. ఫైనార్ట్స్, సోషల్ సర్వీస్, వక్తృత్వ పోటీలు, ఎలెక్షన్స్– ఒకటేమిటి?"

నోరావలించి వినసాగారు లహరీ, విజయ్.

"మద్యపానం, వరకట్న దురాచారం, అంటరానితనం, స్త్రీలకు సమాన హక్కులు మొదలైన విషయాల మీద అతడు ఉపన్యాసాలిస్తూంటే ఆనాడే లెక్చరర్స్, ప్రిన్సిపాల్ సైతం ఎంతో గౌరవంగా విని మెచ్చుకునేవారు. స్టూడెంట్స్ పిన్‌డ్రాప్ సైలెన్స్‌తో వినే వారు, తెలుసా?"

"అబ్బా!!" లహరీ, విజయ్ ఒక్క అన్నారు, ఆశ్చర్యం కలుగగా.

"ఏం, భట్రాజులు ఒకరికి ముగ్గు రయ్యారా?"

లోనుండి కాఫీలతో తిరిగి వచ్చిన కమల విసుగ్గా అడిగింది.

"అబ్బ! నాన్నగారి ఫ్రెండ్ చాలా గొప్పవారమ్మా! ఆరోజు నేను కాలేజి మానేస్తాను. ఆయన్ని తప్పక చూడవల సిందే!" అన్నది లహరి.

"ఈ మాటలకేం గానీ– ఆయన నాకేమైనా ఉద్యోగం వేయిస్తారేమో చూస్తాను. నేనే అడుగుతాను నాన్నగారు అడగకపోతే" అన్నాడు విజయ్.

గర్వంగా చూచాడు సీతాపతి.

"ఓ! అదెంత పని! నాకూ వున్నాయి ఈ విషయాలన్నీ మనసులో. గొప్ప వాళ్ళతో స్నేహాలు వూరకపోతాయా?"

"నాన్నగారూ! మరి యింతకాలంగా ఈ స్నేహితుని దగ్గఱకు మీరెప్పుడూ వెళ్ళలేదేం? కనీసం ఉత్తరాలు కూడా రాసుకున్నట్టులేదే ఎప్పుడూ?" లహరి సందేహం వెలిబుచ్చింది.

"నీకు తెలుసు కదమ్మా నేను ఏ స్నేహాన్నీ స్వార్థానికి ఉపయోగించుకో నని? అభిమానం నాకు ప్రాణం. నే నెవ్వరినీ ఏమీ అడగను. మీరూ అలాగే వుండాలి."

కమల చురుగ్గా చూచింది.

"అయితే మరి ఇప్పుడీ ఆర్భాటం ఎందుకూ స్నేహితునికోసం?"

"బాగుంది. అది మర్యాద! వాడు నేనున్న ఊరికి వస్తున్నాడని నేను చేస్తూన్న మర్యాద! వాడి ఔన్నత్యం చూచి నేను ఆనందించుతూన్నానని చెప్పడం. అంతే!"

"సరేకానీ నాన్నగారూ మీ స్నేహితుడు కాలేజీ రోజుల్లో హీరోలా వుండేవాడా?" కుతూహలంగా అడిగాడు విజయ్.

"అది! బాగా అడిగావ్. అప్పుం హీరోలాగే వుండేవాడు. అందరూ వాడి చుట్టూనే వుండేవారు. అంతటి ఆకర్షణా, వితరణా కూడా వున్నాయి వాడిలో."


మాటలు పూర్తిచేస్తూ, కమల వేపు చూచిన సీతాపతి ఆమె వాడిచూపులకు కలవరపడి త్వరత్వరగా కనులు త్రిప్పుకొన్నాడు.

"అందరిలోనూ మీతో ఎక్కువ స్నేహమా నాన్నగారూ ఆయనకు?" విజయ్ అడిగాడు.

"ఔనురా. ఏం అన్నీ అంత వివరంగా అడుగుతున్నారు? నా స్నేహితుడిని ఒక్కరోజు పిలుచుకోవడానికి ఇన్ని సమాధానాలు చెప్పుకోవలసి వస్తోంది? మనింటి కెందరు రావడంలేదు? ఎప్పుడూ మీరింత కుతూహలంగా అడగలేదే?"

"మరి ఎవరి కోసమూ మీరింత ఆర్భాటం చేయలేదుగా నాన్నగారూ? అందుకు అడిగాను. నేను స్కూటర్ కొనుక్కుంటానంటే 'ఎందుకురా ఎనిమిదివేల ఖర్చు యిప్పుడూ?' అన్నారు. మరి ఇప్పుడు కేవలం అతడి స్వాగత సత్కారాల కోసమే........"

"అదా? తర్వాత నువ్వే చూస్తావుగా? నేను స్నానంచేసి ఓసారి బయటికి వెళ్తాను."




పిల్లలకు సరిగా సమాధానం చెప్పలేక ఏదో ఒక వంకతో పారిపోతూన్న భర్తను జాలిగా చూసింది కమల.

"ఎలాగైనా అమ్మ ఎందుకో అంత యిష్టపడ్తున్నట్టు లేదు సర్వేశ్వర్రావు గారి రాకను."

సర్వేశ్వర్రావు రేపు వస్తాడనగా ఈ రోజు రాత్రి భోజనాలవద్ద సందేహం వెలిబుచ్చాడు విజయ్.

"మీ అమ్మ అంతేలే. ఆడవాళ్ళంతా అంతే అసలు. ఖర్చుకు ఒకటే బాధపడిపోతారు. అంతస్థుకు తగ్గట్లుగా బంధుమిత్రుల రాకపోకలు జరిపించాలని తెల్సుకోరు" అన్నాడు సీతాపతి.

"నేనేమన్నా నిప్పుడూ? మీ మాట ప్రకారం అన్నీ జరుగుతూనే వున్నాయిగా?" కమల నిష్ఠూరంగా అన్నది.

"ఎందుకు జరుగవు? అది కాదు నేననేది. అతడు వస్తాడనే మాట విన్న దగ్గఱనుండీ నీ ముఖంలో కాంతి తగ్గిపోయింది. ఏదో నా మాట కాదనలేక సహకరించుతూన్నట్లుంది. అది పిల్లలకు కూడా గ్రహింపు అయ్యింది గనుకనే వాడలా అడుగుతున్నాడు. సిగ్గుపడాలి."

విస్తుపోయింది కమల.

'ఏమిటీ అనవసర గాలివాన?' అంటున్నట్లున్నాయి ఆమె చూపులు.

"రేపు వాడొచ్చాక కూడ యిట్లాగే ప్రవర్తించకు. ఖర్మ. వాడి వెంట బలగంలో ఒకరిద్దరు ఆడవాళ్ళు కూడా వుండొచ్చు!"

కమల సహనాన్ని విస్మరించింది.

"ఔను వుంటారు ఆడవాళ్ళు. ఈనాడు వుండటానికేం ఆశ్చర్యం_ఇంత హోదా, పలుకుబడీ వున్నవాడి వెంట వేలాది వుండవచ్చు. అనాడు విద్యార్థిదశలోనే వందలాది అమాయకపు ఆడపిల్లలను చుట్టూ త్రిప్పుకొన్న ఘనుడు!"

సర్వేశ్వర్రావును గురించిన తండ్రి చిత్రీకరణకు భిన్నంగా వున్న ఈ క్రొత్త వివరణను విని విస్మయంగా ముఖముఖాలు చూచుకున్నారు లహరీవిజయ్‌లు.

సీతాపతి వదనం గంభీరంగా మారిపోయింది.

"తిరిగే గుణమున్న ఆడది తిరుగుతుంది తెలివితక్కువగా, గొప్పవాడు_ అందగాడు_వలలో పడతాడేమో చూడాలని ఆశతో ప్రయత్నించారు అనేకమంది. అది వాళ్ళ బుద్ధితక్కువ. మధ్యన వాడి నెందుకూ అనుకోవడం?"

"ఎందుకా? వాళ్ళలా బుద్ధినీ, మనసునూ పారవేసుకొనేంత చాతుర్యంతో మత్తు వ్రాతలు వ్రాసేవాడు; మాయ ఉపన్యాసా లిచ్చేవాడు!"

"వ్రాసుకునేవాళ్ళు వ్రాసుకుంటారు. ఉపన్యాసా లివ్వగల వాళ్ళిస్తారు. మధ్యన ఎవళ్ళో అందుకు మతిపోగొట్టుకుంటే వాడా బాధ్యుడు అందుకు?" సీతాపతి గట్టిగా అన్నాడు.

కమల కినుకగా చూచింది.

"ఒక్కమాట ఒప్పుకుంటారా లేదా?"

"ఏమిటి?"

"మీ మట్టుకు మీరు అతడివల్ల అవమానం పొందారా లేదా? నిజం ఒప్పుకొంటారనుకుంటాను."

"నేనా? ఛఛ, ఎప్పుడు?"

"హుం! ఎప్పుడా? ఎందుకండీ అంత ఆత్మవంచన? మీ చెల్లెలు విమలను పెళ్ళిజేద్దామనుకోలేదూ అతడికి? అతడిచ్చిన సమాధాన మేమిటి అందుకు?"

"……….."

"మాట్లాడరేం? నా కెలా తెలిసిందనా? మీరెప్పుడూ చెప్పలేదు, కానీ విమల నాకంతా చెప్పింది. నాకూ విమలకూ దాపరికాలు లేవు!"

చాలా సేపటికి మాట్లాడాడు సీతాపతి!

"అతడు అప్పుడు అస్వతంత్రుడు; తండ్రి చాటువాడు! తానేం చేయగలడు?"

"ఇదంతా ఏమిటో మాకు అర్థం కావడంలేదమ్మా, వివరిస్తారా?" అన్నాడు విజయ్.

"అవసరంలేదు గాని మీరు పోయి చదువుకోండి." విసుగూ కోపం మిళాయించి కసురుకొంటూ తాను అక్కడి నుండి వెళ్ళిపోయాడే కానీ కమల గుర్తుచేసిన ఆ సంఘటన అతడి మస్తిష్కంలో మెదలుతోంది.

నిజానికి, ఆ సంఘటనను తాను మఱచిన దెప్పుడు ఇప్పుడు క్రొత్తగా జ్ఞప్తికి వచ్చిందనుకోవడానికి?

* * *

"స్త్రీ పురుషుని కెంతవసరమో పురుషునికి కూడా స్త్రీ అంతే అవసరం. అందుకే అతడి ఆధిక్యతను ప్రదర్శించి, అహాన్ని పెంచే ఈ వరకట్న దురాచారం సమసిపోవాలి!"

కళాశాల అందరికీ ఆరాధ్యుడైన సర్వేశ్వర్రావు, ఈ అమూల్య ప్రసంగంతో మరింత ఎగబ్రాకాడు అతడి అభిమానుల దృష్టిలో. "ఆహా! ఒక విద్యార్థి మాట్లాడుతున్నట్టులేదు— ఎవరో గొప్ప వక్త అయిన రాజకీయనాయకుడు ఉపన్యాసమిస్తూన్నట్లుంది గానీ," అని ప్రశంసించారు అనేకమంది.

"వరకట్నం అడిగినవారిని కన్యలు అసహ్యించుకోవాలి. వివాహం చేసుకోరాదు. వివాహాలే మానుకోవాలి. అప్పుడే పురుషులు అహంకారం మఱచేది. అప్పుడే మూర్తిత్రయశక్తి స్వరూపిణి అయిన స్త్రీ విలువ మనదేశంలో పెరిగేది! మన యువకుల మంతా కూడా ఇందు నిమిత్తమై కంకణం కట్టుకోవాలి………"

ఈ రీతిగా సర్వేశ్వర్రావు ఆదర్శోపన్యాసం సాగిపోయేది. దీపం చెస ఆకర్షిత మయ్యే శలభాల వలె ఆ ఆదర్శ యువకుని చుట్టూ అనేకమంది యువతీ యువకులు ఆకర్షితులై తిరిగేవారు. ఎన్నో విషయాలలో ఆశలు పెంచుకొనేవారు. వారిలో కొందరు ఉపాధ్యాయులు కూడా లేకపోలేదు!

అనేకమంది ఆశలను అవలీలగా తీర్చేవాడు కూడా సర్వేశ్వర్రావు.

కాలేజి ఫీజులు కట్టలేనివారిని, పుస్తకాలు కొనలేక అవస్థలుపడేవారిని ఆదుకొనేవాడు. వారు అతడిని నిత్యం వెన్నంటి వుండేవారు భక్తిగౌరవాలతో. అతడు సినిమాకు పోయినా వెంటనే వుండేవారు. అన్నపానాదులు అతడి చలవతోనే అతడితోనే జరిగిపోయేవి. కొద్ది పాతబడగానే దుస్తులు అతడి పరివారానికి అందేవి. అతడిని వెన్నంటి వుండే ఈ బృందంలో కేవలం యువకులే కాదు, యువతులు కూడా వుండేవారు!

రోజీ కళాశాల ఖర్చంతా సర్వేశ్వర్రావే భరించడమే కాకుండా రోజీ తండ్రి ఏదో కేసులో యిరుక్కుంటే ఆ న్యాయస్థానపు ఖర్చు కూడా అతడే యిచ్చాడు. సహాధ్యాయిని సంధ్య తల్లి వైద్యానికి ఆదుకొన్నాడు; చనిపోతే కూడ ఆదుకున్నాడు.

కేవలం సహాధ్యాయులకే అతడి సహాయసహకార హస్తం పరిమితంకాదు; ఉపాధ్యాయులకు కూడా అతడు కావలసినవాడే అన్పించేట్లు మెలిగేవాడు. ఒక లెక్చరర్ యింట వివాహమైనా, మరొక లెక్చరర్ యింట ఎవరైనా మృతి జెందినా— ఇంకొకరికి ఉద్యోగం బదిలీ అయినా ఆయా పనులన్నిటా సర్వేశ్వర్రావు స్వయంగా నిలబడి పనులు చేయడమే కాక అతడి తండ్రి కారూ, లారీ వాటివాటి డ్రైవర్లూ కూడా ఆయా కార్యాలకు ఉపయోగపడేవారు.

కానీ సర్వేశ్వర్రావు చేసిన అన్యాయం వల్లనే కాత్యాయని అనే సహాధ్యాయిని ఆత్మహత్య చేసుకున్నదనీ, శంకరం మేష్టారు కుమార్తె దుష్ప్రవర్తన వల్లనే పిచ్చిపట్టి దేశాల వెంబడి పోవడంలో కూడ సర్వేశ్వర్రావు పాత్ర లేకపోలేదనీ కొందరు అనినప్పటికీ అది కేవలం అతడి యశస్సును ఓర్వలేనివారు అపప్రథ పాలుచేసే దురుద్దేశ్యంతో పుట్టించిన వదంతులని కొందరు అంటారు.

చంద్రుని అందాలు తిలకించే వారికి అందలి మచ్చ కన్పించదు; సర్వేశ్వరరావు కీర్తిచంద్రికలలోని చిన్న చిన్న మచ్చలు లెక్కకు రావు; జనం ఏనాడో అవి విస్మరించారు కూడా!

ఏది ఏమైనా సర్వేశ్వర్రావు స్నేహ

బృందానికి అతడు దేవుడు. హాస్టల్‌లో ఒకేరూంలో వుంటూండే సర్వేశ్వర్రావూ సీతాపతీ అరమరికలు లేకుండా మసలడం వల్ల సీతాపతి కూడ సర్వేశ్వర్రావుపై కొన్ని ఆశలు పెంచుకున్నాడు.

"అబ్బ! ఈ ఏడు పూర్తికాగానే మనం విడిపోతాం అనుకుంటే బాధగా వుందిరా సీతాపతీ!" అన్నాడు ఓనాడు రాత్రి సర్వేశ్వర్రావు.

ఎలెక్ట్రిక్ హీటర్‌పై టీ కాచి కలుపుతూన్న సీతాపతి అవకాశం జారవిడుచుకోలేదు. "విడిపోవా లనుకుంటే విడిపోతాం; కలియాలనుకుంటే కలుస్తాం" అన్నాడు గుంభనంగా.

"ఔన్లే. మళ్ళీ పై చదువులు ఒకే చోట చదువుదాం. నువ్వు నీ అదేదో కోర్సు– ట్రెయినింగ్ గోల వదిలేసి, చక్కగా నాతోపాటు 'లా' చదువు."

"లేదు. నాకా అవకాశం లేదు. నేను అనేది అది కాదు."

"మరి? ఇంకెలా వుండగలం ఒక చోట? నేను మాత్రం ఆ ట్రెయినింగ్ అవ్వలేనురా నాయనా."

"అదీ అవసరం లేదు."

"ఇంకేమిటోయ్ మరీ? వివరంగా చెప్పకుండా వేధిస్తున్నావు."


"చెప్పనా?"

"అఘోరించమంటూంటే."

"బంధుత్వం ఏర్పడితే ఒక్క– చోట వుండగలం!"

"అం!"

"ఔను. మొన్న సెలవులకు నాతో మా వూరు వచ్చినపుడు మా చెల్లెలు విమలను చూచావు. దాని పాటనూ, వినయ విధేయతలనూ మరీ మరీ మెచ్చుకున్నావు. అటువంటి ఛలాకీ పిల్లలంటే నీ కిష్టమని అన్నావు. అప్పటి నుంచీ నాకు విమలను నీ కిచ్చి ఇంకా దగ్గర కావాలనే ఆశ ఏర్పడింది. ఏమంటావు?"




సర్వేశ్వర్రావు ముఖంలో రంగులు త్వరత్వరగా మారిపోయాయి. హఠాత్తుగా గంభీరంగా మారిపోయాడు.

సీతాపతి ఖిన్నుడైనాడు.

"నీవు ఆదర్శవాదివి. కట్నం తీసుకోవడం తప్పనీ, వివాహం పవిత్రబంధమనీ అంటుంటావు. 'విమలవంటి యువతిని ఇంతవరకూ చూడలే'దని నీవే అన్నావు. నీకింకా పెండ్లి నిశ్చయం కాని విషయం కూడా తెలుస్తూనే ఉంది— నిన్ననే కదా మీ నాన్నగారు ఉత్తరం వ్రాశారు 'నీ కింకా ఏ సంబంధం కుదరడంలే'దని?"

తల పంకించుతూ కొంత తడవు సర్వేశ్వర్రావు అటుయిటు పచార్లు చేసాడు.

హఠాత్తుగా ఆగి అతి సరళంగా స్థిరంగా మాట్లాడాడు.

"చూడు సీతాపతీ! నువ్విచ్చే ఈ గౌరవానికి నాకు అమితానందంగా వున్న మాట నిజమే. నా ఆశ కూడ అలాగే వున్నా నేను నిస్సహాయుడిని."

తెల్లబోయిన సీతాపతి కారణం అడిగేడు.

సర్వేశ్వర్రావు అతి చతురంగా చెప్పిన జవాబు జన్మలో మరువలేనిది.

"నాకు ఆదర్శాలున్నాయి సీతాపతీ! ఆచరించడానికి మాత్రం అనేక అడ్డంకులు. నేనా యింకా విద్యార్థి దశలోనే వున్నాను కదా? పుట్టిననాటినుంచీ— ఆ మాటకొస్తే కడుపునపడిన నాటినుండీ ఈ రోజు– ఈ క్షణం వరకూ పోషించుతూన్న తల్లిదండ్రుల అధీనంలో వున్న వాడిని. వారి యిష్టాలనూ ఆశలనూ కాదనడానికి నే నెవర్ని?"

సీతాపతి గుడ్లప్పగించి వింటున్నాడు.

"అలా ఆశ్చర్యపోకురా ఫ్రెండ్!" అని సస్నేహంగా అతడి భుజం తట్టాడు సర్వేశ్వర్రావు.

"చూడు సీతాపతీ! మనం ఈ రోజు విత్తనం నాటితే అది ఇపుడే చెట్టుగా ఎదిగి మనకు పళ్ళను ప్రసాదిస్తుందా? ఇవ్వదు. ఇదీ అంతే. మన ఆదర్శాలు పక్వంచెంది భవిష్యత్తరాలవారికి ఫలసాయాన్ని ప్రసాదించుతాయి కానీ మనం ప్రస్తుతం ప్రపంచరీతిలోనే సాగిపోవాలి. ఏటి కెదురీది నిలువలేము; అమ్మనాన్నలు అవతలికి పొమ్మంటే అడుక్కు– తినడానికే ప్రొద్దు సరిపోదు: ఇక ఆదర్శాల నేం సాధించ గలుగుతాం?"

విన్నకొలదీ మతిపోతున్న సీతాపతి కొయ్యబారిపోయాడు.

"అరే! బీ స్పోర్టివ్ మై ఫ్రెండ్! ఇది నిజ ప్రపంచం! నేల విడిచి సాము చేయలేం. నలుగురు నడిచినదారి వదిలితే బ్రతుకలేం. అర్థంచేసుకో!"

* * *

విమల ఆ షాక్‌నుండి చాలా రోజులకు గానీ తేరుకోలేకపోయింది.

అనవసర ఆశలు కల్పించిన సీతాపతి ఇంట అందరి చీవాట్లకూ గురిఅయ్యాడు.

తర్వాత అతడు సర్వేశ్వర్రావు ముఖం చూడలేదు. కానీ యిప్పు డన్పిస్తోంది— నిజమే! సర్వేశ్వర్రావు మాటలు అక్షరాలా నిజం. పెద్దల గౌరవ మర్యాదలు కూడ ఆలోచించిన ఉత్తముడతడు. ఈనాడు తానూ ఒక యువకునికి తండ్రే! మరి తన విజయ్ స్వతంత్రించి ప్రవర్తించితే తాను మాత్రం సహించుతాడా? తల్లిదండ్రుల ఆశలు వారి కుంటాయి కదా! అందువల్ల ఆనాటి సర్వేశ్వర్రావు ప్రవర్తన ఏ మాత్రమూ ఆక్షేపణీయం కాదు.

"ఇప్పుడు సర్వేశ్వర్రావు సర్వ స్వతంత్రుడు. తన ఆదర్శాలను తప్పక పాటించుతాడు. అందుకే ప్రజలలో అంత పేరు అతడికి!" అన్నాడు సీతాపతి భార్యతో.

"కావచ్చు." నిర్లిప్తంగా అన్నది కమల.

"కావచ్చేమిటి? తప్పక! చూస్కో! మన లహరిని అతడికి కోడల్ని చేసుకుంటాడు!"

మతిపోయినట్లు చూచింది కమల.

"ఏమిటలా చూస్తావ్? నమ్మకంగా లేదా?"

"హుం! పెండ్లి అనేది అంత చౌకబారు విషయం కాదు— అంత తేలికగా పిల్లల ఎదుట చర్చించడానికి. అలీ లేదు చూలీ లేదు, పేరు ఏమిటని ఆలోచించాడట ఎవడో!"

"లేదులే, ఆధారం ఉన్నది నాకు. సర్వేశ్వర్రావుకు అయిదుగురు కొడుకులట. పెద్దవాళ్ళిద్దరికీ వివాహాలైనాయట! మూడోవాడి పెండ్లి కుదిరిందట ఈ వూరే— ఆ సందర్భంగా నిశ్చయాలకు కూడా వస్తున్నాడట. నాలుగోవాడి పెండ్లి చూపులు కూడానట. మా స్నేహితుడొకడికి వాడు రాసిన ఉత్తరం వుంది!"

"తెలివైనవాడు అన్ని ప్రోగ్రాములూ కలిపి పెట్టుకున్నాడు!" అన్నది కమల.

"అవన్నీ మనకెందుకు గానీ— వాడు చూడబోయే సంబంధం మాత్రం కుదరదు. నాకు తెలుసు. పిల్ల ఏమీ బాగుండదు. వాడి పిల్లలు మహా అందగాళ్ళట.

"ఓహో!" సాలోచనగా అన్నది కమల. "మరి ఇదివరకే కుదిరివున్న ఆ సంబంధం వాళ్ళెవరు?"

"ఆఁ.... బజార్లో పెద్ద స్టీలుసామాను కొట్టులేదూ— పరంధామయ్య— —"

"ఓహో! ఒక్కతే పిల్ల వాళ్ళకు. వాళ్ళేనా?"

"ఆఁ ఆఁ. వాళ్ళే."

"ఆ పిల్ల కూడా ఏమీ బాగుండదు. నాకు తెలుసు ఆ అమ్మాయి మన లహరికి క్లాస్‌మేట్!"

"అలాగా?"

"ఆఁ! నా ఉద్దేశ్యంలో.... మీ స్నేహితునితో వియ్యమందే అర్హత వుండాలంటే బోలెడు ఆస్తి వున్నవాళ్ళకి ఒక్కతే కూతురు ఉండాలి; రూపం ఎలాగున్నా సరే!"

"కమలా!"

"ఔను, అబద్ధంకాదు. సర్వేశ్వర్రావు కూడా బాగా ధనవంతుల ఏకైక పుత్రికను వివాహమాడాడని విమల చెప్పింది!"

సీతాపతి తల వాల్చుకున్నాడు.

"పెద్ద కొడుకు లిద్దరికీ కూడా అటువంటి సంబంధాలే తెచ్చి వుంటాడు! పోనీలెండి. అతడి స్వంత విషయం అది! మీరు మాత్రం లోగడ విమల మనస్సును నొప్పించినట్లు ఇప్పుడు లహరికేమీ అలవిమారిన ఆశలు కల్పించి, దాని మనసును పాడుచేయకండి. స్నేహితుడు స్నేహితుడుగానే వచ్చిపోతే బాగుంటుంది! లహరి నా బిడ్డ గనుక, మీకు కోపం వచ్చినా చెప్పేశాను. సారీ!"

సీతాపతి తక్కువ వాడేమీ కాదు కోపతాపాల విషయంలో.

"మీ ఆడవాళ్ళను అందుకే సంకుచితులు అన్నారు. మన కోరిక విఫలమయినంత మాత్రాన అవతలి వాళ్ళను దుయ్యబట్టడమేనా?"

"ఆశలూ- విఫలం" అనేవి అడియాసలుండేవాళ్ళ విషయంలో అనాలి. మన విషయంలో కాదు. నా హద్దులు నాకు తెలుసు. మిమ్మల్ని కూడా తెలుసుకోమని మాత్రమే నా ప్రార్థన. దీపం చుట్టూ తిరిగి, మాడిపోయే శలభాలతో మనమూ ఒక శలభం కాకూడదు."

"ఊఁ, కట్టిపెట్టు అధిక ప్రలాపన!"

విపరీత కోపం ప్రదర్శించి, తన గదిలోకి వెళ్ళిపోయాడు సీతాపతి.

"హుఁ, ఈ దేశంలో నూటికి తొంభై మంది మగవారు యింతే. స్త్రీ మాటను తేలికగా కొట్టిపారవేస్తారు, తమ మాటే వేదవాక్కు అనుకుంటారు!"

బాధగా అన్నది కమల.

అంతా చూస్తున్న లహరీ విజయ్‌లు ముఖముఖాలు చూచుకున్నారు.

"పదిమందిలో తిరిగే నాన్నగారి జ్ఞానానికీ, ఇంట్లో కూర్చునే నీ ఆలోచనలకూ చాలా దూరముంటుందమ్మా! ఆయనకు అవివేకంగా అడ్డుతగలకు."

ముక్త కంఠంతో అనేసి అన్నాచెల్లెళ్లు అక్కడనుండి నిష్క్రమించారు.

నివ్వెరపాటునందిన కమల నీర్సంగా, నిర్లిప్తంగా నవ్వుకున్నది తనలో తాను.

'బిడ్డలకు మేలు జరుగుతుందంటే తల్లిగా తనకంటె సంతోషించేవారెవరు?

'వారు తీసుకునే నిర్ణయాలూ, వేస్తూ ఉన్న అడుగులూ సరైనవి అవునా కాదా

అని అమ్మగా తనకంటె ఆలోచించేది మాత్రమెవరు?'

అయితే, ఒక విధమైన ఆవేశమూ, ఆశా అవివేకాన్ని కలుగజేయడంలో ఆశ్చర్యం లేదు.

తటస్థతకు మించిన కర్తవ్యం స్ఫురించలేదు కమలకు.

ఎదురుచూచిన సమయం రానే వచ్చింది.

మగ పెండ్లివారు తరలి వస్తుంటే ఎదుర్కోలు సన్నాహానికి ఆయత్త మౌతూన్న ఆడ పెండ్లివారి ఇల్లులాగా వున్నది సీతాపతి గృహమూ, అందలి వాతావరణమూ.

అప్పటికి మూడురోజులైంది సర్వేశ్వర్రావు పట్టణంలోకి వచ్చి.

ఒక ప్రముఖ సంస్థ తాలూకు గెస్ట్ హౌస్‌లో వున్నాడు. పట్టణంలోని ప్రముఖ సంస్థలన్నీ అతడి స్వాగత సత్కారాల ఏర్పాట్లతో హడావుడి చేస్తున్నాయి.

పోటాపోటీలుగా సమావేశాలూ సభలూ ఏర్పఱచి, అతడి అమూల్య సందేశాలనూ, ఉపన్యాసాలనూ విని తరించుతున్నాయి; విందులు చేస్తున్నాయి.

నిత్యం అనేకమంది అధికారులూ, అనధికారులూ, పెద్దలూ చిన్నలూ కూడా అతడివెంట వందిమాగధుల వలె తిరుగుతున్నారు; అతడు విశ్రాంతి తీసుకునే సమయాలలో బయట పడిగాపులుపడి వుంటున్నారు. వారిలో సీతాపతి కూడా ఒకడే మరి!

సీతాపతీ సర్వేశ్వర్రావూ ఒకప్పుడు సహాధ్యాయులనే అపురూప సత్యం ఎలాగో అందరికీ తెలిసిపోయింది! సర్వేశ్వర్రావు ప్రాపకమూ, అభిమానమూ సంపాదించ గోరిన వారెవరైనాసరే సీతాపతిని అడిగి తెలుసుకుంటున్నారు. సర్వేశ్వర్రావుగారి రుచులూ, యిష్టాలూ. సరదాలూ గురించి.




ఇది సీతాపతికి ఎంతైనా గర్వకారణంగా వున్నది. అతడు తన యింటికి రావటానికీ పోవటానికీ ఓ సమయమంటూ వుండడంలేదు.

ఈ రోజు సర్వేశ్వర్రావు సీతాపతి యిల్లు పావనం కావించి, అతడి ఆతిథ్యాన్ని దయతో స్వీకరింపబోతూన్న రోజు. అందుకే గత అర్ధరాత్రి యింటికి వచ్చిన సీతాపతి మరెక్కడికీ కదలక యింటిపట్టుననే వున్నాడు, ఏర్పాట్లు చూస్తూ.

"ఈ రోజు అమ్మాయిని యింటి దగ్గరే వుండమను. కాలేజీకి పంపకు" అన్నాడు భార్యతో ఉదయం.

కమల చిరుహాసం చేసింది.

"ఆ విషయం లహరికి బాగానే తెలుసు. అది నిన్నా మొన్నా కూడ ఇంటిదగ్గరే వున్నది. విజయ్ సరేసరి- మీ వెంటనే వుంటున్నాడు కదా! వాళ్ళు మీకు తగిన బిడ్డలు!"

గర్వంగా చూచిన సీతాపతి అంతలోనే అందలి వ్యంగ్యం గ్రహించినవాడై, వచ్చే కోపాన్ని అణచి, ఓర్పుగానే అన్నాడు కమలతో.

"చూడూ, నన్ను బొత్తిగా వెఱ్ఱి వాడిగా జమకట్టకు. వెనకటి సంగతి వేరు. ఆనాడు సర్వేశ్వర్రావు తండ్రి చాటు కొడుకు. అందుకే స్వతంత్రించ లేకపోయాడు. ఈనాడు తానే తండ్రి! తన ఆదర్శాలను చక్కగా అమలులో పెట్టగల సర్వస్వతంత్రుడు! చూస్తూండు- లహరి అతడి కోడలు కాకపోతే నా పేరు సీతాపతే కాదు. మొన్న చూచిన పెండ్లిచూపులలో పిల్ల నచ్చలేదని నాతో తానే స్వయంగా చెప్పాడు!"

అప్పటికీ కమల వదనంలో కాంతిని కనలేని సీతాపతి మరింత ఓరిమితో అనునయంగా అర్థమయేట్లు చెప్పాడు!

"చూడూ! మన విజయ్ ఇవాళో రేపో తన యిష్టమైన ఒక అమ్మాయిని తెచ్చి 'ఇదిగో మీకోడలు!' అన్నాడనుకో! అప్పుడు మన మనస్సు లెలా వుంటాయి?"

కమల నివ్వెరపాటుతో చూచింది.

మాటలాడ లేకపోయింది కానీ ఆ భావాలను ఆ భర్త చదవ గలిగాడు.

తేలికగా నవ్వేస్తూ చెప్పాడు!

"చూచావా మరి? మనవరకూ వస్తేగానీ ఏదీ అర్థంకాదు. లహరి విషయంలో ఆలోచించినట్లుగా విజయ్ విషయంలో యోచించలేము."

కమల తల వాల్చుకున్నది తన ఓటమిని అంగీకరిస్తూన్నట్లుగా.

సంతోషంగా అన్నాడు సీతాపతి.

"గతం గతమే కమలా. ప్రస్తుతం ఆలోచించు, ప్రయత్నించి అదృష్టాన్ని పరీక్షించు కోవడంలో తప్పేమీ లేదు కదా!"

కమల ఈ దేశపు సగటు స్త్రీలకు ప్రతినిధి. భర్త వాదం సమంజసంగా తోచిన ఆ యిల్లాలి మనస్సులో కూడ ఆశ కలిగింది. నూతనోత్సాహం పెల్లుబికింది.

భర్త చేస్తూన్న ఈ వేలాదివేల ఖర్చు గానీ, ఆడంబరాలూ సందడీ కానీ ఇప్పుడు కమలకు అనవసరంగా కన్పట్టడం లేదు.

ఇటు ఆధునికంగానూ గాక అటు మరీ పాత తరహాగానూ గాకుండా అతి అందంగా అలంకరించింది కుమార్తెను.

విందు అద్భుతంగా ముగిసింది.

'సర్వేశ్వర్రావు చాలా నిరాడంబరుడు. మితభాషి, మధురభాషి! విమల చిత్రీకరణకూ ఈ వ్యక్తి ప్రత్యక్షంగా ప్రదర్శిస్తూన్న స్వభావ ప్రవర్తనలకూ పోలికే లేదు. విమల ఏదో పొరపడి వుండవచ్చు అప్పట్లో.'

అనే అభిప్రాయం కలిగింది కమలకు.

సర్వేశ్వర్రావు సీతాపతి ఇంట్లో అందరినీ పరిచయం చేసుకున్నాడు. తగినట్లుగా చక్కగా మాట్లాడాడు.

"ఏమమ్మా! ఇందరు శిష్యుల్ని సంపాదించాను కానీ మీ అయన్ని మాత్రం నా రాజకీయాల్లోనికి లాగలేకపోయాను." అంటూ చమత్కరించాడు అతడు కమలతో.

"మీ నాన్న దార్లోనే వుంటావా? ఇంకేమైనా ఆలోచిస్తున్నావా? చాకు లాంటి కుర్రాడివి— తెలివిని దేశానికి వినియోగించాలి." అని ఆప్యాయంగా భుజం తట్టాడు విజయ్‌ని.

లహరిని చిరునవ్వుతోనే పలుకరించాడు.

"ఇంకా చదివిస్తావా, వివాహం చేస్తావా?" అని అడిగాడు సీతాపతిని.

సీతాపతి ఉబ్బితబ్బిబ్బైపోయి మాటలకు తడుముకుంటూండగా కమల తెలివిగా సమాధానం చెప్పింది.

"మాలాంటి వాళ్ళం పెళ్ళిళ్ళెలా చేయగలం అన్నగారూ? పెళ్ళంటే వెండి బంగారాలూ, లక్షలూ కావాలి కదా!"

సర్వేశ్వర్రావు అందంగా నవ్వాడు.

"ఇంతటి లక్ష్మిలాంటి బిడ్డ విషయంలో బెంగెందుకమ్మా? ఎవరో అదృష్టవంతుడు ఈ అందాల బొమ్మ కోసం బంగారుపూల పూజ చేస్తుంటాడు. అమ్మాయి నిలబడిన చోటే సిరినిలయం కాదూ?"

"చూచావా? అతడు తనంత తానే లక్ష్మి— సిరి అంటూ అమ్మాయిమీద తన సదభిప్రాయం ఎంత బాగా చెప్పాడో! మనం అడగడమే తరవాయి— 'ఊఁ' అంటాడు— చూడు!"

అన్నాడు సీతాపతి సర్వేశ్వర్రావుకు ఘనంగా వీడ్కోలిచ్చిన అనంతరం.

కమలా సీతాపతిలలోనే కాదు— లహరీ విజయ్‌లలో కూడ ఆశావృక్షాలు వేళ్ళు తన్నాయి.

చాలా రోజులు సర్వేశ్వర్రావు ఉత్తరంకోసం ఎదురు చూచారు అందరూ.

రెండునెలల అనంతరం వచ్చింది. యోగక్షేమాల ప్రసక్తి, పొందిన మర్యాదలకు కృతజ్ఞతలూ మాత్రమే వున్నాయి అందులో.

"ఎంతైనా ఆడపిల్లవాళ్ళం. మనం అడగాలి నోరు తెరిచి. ఆయన తన అంగీకారాన్ని ఆనాడే అన్యోపదేశంగా తెలిపారు కదా!" అన్నది కమల ఆరందాగా.

సబబే అన్పించింది సీతాపతికి.

ఆరుసార్లు హైదరాబాద్ వెళ్ళడమూ రావడమూ జరిగింది ఉస్సూరనుకుంటూ.

ఏడవసారి మాత్రమే సదరు సర్వేశ్వర్రావుగారి దర్శనం కలిగింది. సర్వేశ్వర్రావు చేసిన తలకుమించిన మర్యాదలతో తబ్బిబ్బు అయ్యాడు సీతాపతి.

సీతాపతి ప్రతిపాదనలన్నింటినీ చిరునవ్వుతో సరసంగా విన్నాడు సర్వేశ్వర్రావు. సీతాపతితో వియ్యమందేందుకు తానూ ఉవ్విళ్ళూరుతున్నట్లు చెప్పాడు. అందల మెక్కినట్లే ఆనందించాడు సీతాపతి.

భోజన సమయంలో సర్వేశ్వర్రావు కుటుంబ సభ్యులందరినీ చూడగలిగిన సీతాపతి అమితంగా కలవరపడ్డాడు. ఒక్కొక్కరు ప్రదర్శిస్తున్న ఆడంబరాలు కళ్ళు తిరిగేట్లు చేస్తున్నాయి. కానీ సర్వేశ్వర్రావూ అతని కుమారులలో మూడవవాడూ అఖరివాళ్ళిద్దరూ మినహా మిగిలినవారు ఆఫ్రికన్ కుటుంబాలను గుర్తుకు తెస్తున్నారు.

సర్వేశ్వర్రావు సహధర్మచారిణి కూడ చాలా కలుపుగోలుగా మాట్లాడింది. 'చక్కటి స్వభావమే' అన్పించింది సీతాపతికి. కానీ అంతటి అందగాడైన సర్వేశ్వర్రావుకు యింతటి అనాకారి భార్యా?

స్వగ్రామం తిరిగివచ్చాక భార్యతో అదే అభిప్రాయాన్ని వ్యక్తీకరించాడు సీతాపతి.

కమలకు మాత్రం అదేమీ విడ్డూరమన్పించలేదు. ఇటీవలి కాలంలో సర్వేశ్వర్రావు నిజంగా ఆ సర్వాంతర్యామి వంటి మంచివాడూ, అలాగే అనేక వరాలిచ్చేవాడూగా కన్పిస్తున్నాడాయె!

"మరి అన్నయ్యగారు ఆదర్శపురుషులు కదా! ఆ అనాకారులను కూడా ఉద్ధరించిన ఘనులన్నమాట! లేకుంటే అటువంటివారు తలచుకొంటే అందగత్తెలకేం కొదువండీ?"

"నిజమే కమలా! నాకు తోచలేదు సుమా! కానీ వాళ్ళ నడుమ మన

ఆ మ్మాయి అప్సరసల తేజంతో వెలిగి పోతుందనుకో!"

"అలాగా!" కమల ఆశ్చర్యం.

"ఊఁ! ఎటు చూచినా ఐశ్వర్యమే! రాజభోగా లనుభవిస్తుంది లహరి!"

"అంతా దాని అదృష్టం, మన అదృష్టం! ఇంతకీ వాళ్ళనుండి అన్నీ నిశ్చయంగా తెలిసేదెప్పుడు మనకి?"

"ఉత్తరం వ్రాస్తానన్నారు వివరంగా."

అనుకున్నట్లే ఉత్తరం వచ్చింది సర్వేశ్వరరావు నుండి, వారం రోజులలో వారి అబ్బాయి స్వయంగా వస్తున్నట్లు.

కుటుంబంలో ఆనంద కోలాహలం కోలాటం వేసింది.

లహరి ఊహలకు పట్టపగ్గాలే లేవు!

ఒకరిద్దరు ఆత్మీయులైన స్నేహితురాండ్రకు చెప్పుకొన్నది కూడా 'తన వివాహం ఒక గొప్ప వ్యక్తి కుమారునితో కాబో'తున్నదని.

"ఇంకేం? నాకు గొప్ప ఉద్యోగం ఖాయం!" అంటూ విజయ్ ధీమాగా నిశ్చయించుకున్నాడు.

"మా అమ్మాయి పెండ్లి ఈ వేసవిలో!" అని గొప్పగా ఇరుగుపొరుగులకు చాటించింది కమల.


దేవుని ఆగమనం నిమిత్తం ఎదురు తెన్నులు చూస్తున్నారు యావత్ కుటుంబం.

సదరు దేవుడు పెండ్లికుమారుని రూపంలో వేంచేశాడు.

దేవునికి వాహనమూ, అర్చకులూ వుంటారు.

పెండ్లికుమారునికి కారూ, డ్రైవరూ, అతడు మాట్లాడి అలసిపోకుండా అన్నీ తానే మాట్లాడగల మేనమామా వున్నారు వెంట.

పెద్దవారితో సంబంధమాయె! మర్యాదలకు ఆడంబరంగానే ఖర్చుపెట్టాలి! అందుకే కమల అభ్యంతరాలేం చెప్ప లేదు భర్తకు.



అప్పోసప్పో లేక ఉన్న కాస్తనిలువా కరగదీయడమో— మొత్తంమీద డబ్బు నీళ్ళలా ప్రవహిస్తోంది.

స్నానాలూ, భోజనాలూ అయ్యాక పెండ్లికుమారుడు కారులో ఊళ్ళోకి వెళ్ళిపోయాడు పనిమీద.

అతడి మేనమామ— అనగా సర్వేశ్వర్రావుకి స్వయంగా బావమరిది అయిన కూర్మయ్య సీతాపతితో సంభాషణ ప్రారంభించాడు తీరికగా.

చాటుగా తెరవెనుక కమల, మరో గది కిటికీవద్ద లహరీ పొంచివుండి వింటున్నారు ఆశగా.

"అబ్బాయికి లోగడ చూచిన సంబంధమే ఈ ఊళ్ళో ఖాయపరచుకున్నాం సీతాపతిగారూ. వాళ్ళు మరో నాల్గు లక్షలు పెంచారులెండి కట్నం. అందుకు!"

కళ్ళు తిరిగిపోతున్నాయి శ్రోతలకు.

"ఏ......ఏమిటన్నారూ?"

సీతాపతి తాను తప్పు విన్నానేమోనని మరలా అడిగాడు.

"అదేనండీ. ఆ బిజినెస్‌వారి అమ్మాయి— పిల్ల బాగుండకపోయినా కట్నం వుందిగా— ఒక్కతే పిల్లాయె! వారు ఈ సందర్భంలో చిన్న విందు ఏర్పాటు చేసి ముఖ్యులకు తెలియబరుచుకుంటారట! అందుకే అబ్బాయి అక్కడకు వెళ్ళాడు! కట్నం ముందే మాకు జేరిందిలెండి!"

"మరి....మరి....మా అమ్మాయి...."

కూర్మయ్య నవ్వేశాడు సీతాపతి తడబాటుకు.

"కట్నాలివ్వడం తప్పే. అందుకే మా బావగారు తమ కూతుళ్ళకు కట్నాలివ్వరు, కానీ కొడుకులకు కట్నాలు తీసుకోవద్దనడానికి ఈయనెవరూ? వాళ్ళంతట వాళ్ళు వాళ్ళయ్యాక ఏ కొడుకు వింటాడండీ తండ్రిమాట? రేపు ఆ కొడుకూ తండ్రి అంతటివాడు కావాలి, మినిష్టరో మరోటో అవ్వాలంటే ఎలక్షన్ల ఖర్చు మీలాంటివాళ్ళేం భరించగలరు చెప్పండి?"

"మీ అమ్మాయికేం? నిక్షేపమైన సంబంధం చూస్తాం. ఎందరో ఉద్యోగులు మాబావగారి క్రింద. మరిపోతే, ఈ విషయం శ్రద్ధగా వినండి— మీకు మాతో వియ్యమందాలని వున్నది— మీ అబ్బాయి విజయ్ మా బావగార్ని బాగా ఆకర్షించాడు. అంచేత మా బావగారి రెండో పిల్లని మీ అబ్బాయికి చేస్తే...."

"ఎవరూ? ఆ అమ్మాయి— చెయ్యి పోలియో వల్ల...." సీతాపతి మాటలు పూరించలేకపోయాడు.

"అఁ! అదేమంత పెద్ద లోపమండీ? ఆచేత్తో ఆ పిల్ల ఏంచేయాలి గనుక? అడుగడుగునా నౌకర్లూ, చాకర్లూనూ. ఆలోచించండి, ఇలా పెళ్ళైతుంది—అలా ఇక అబ్బాయి బాధ్యతలేమీ మీకుండవు! మేమే ఉద్యోగం వేయించుకుని మా దగ్గరే అట్టే పెట్టుకుంటాం!"

సీతాపతి అవాక్కుగా చూడసాగాడు.

"ఏమిటి అన్నగారూ ఆలోచన? నేనే మీ స్థానంలో వుంటే వెంటనే 'యస్' అందును. మీరు ఆ అబ్బాయికి సరైన ఉద్యోగం వేయించగలరా? ఒకవేళ యిప్పించగలిగినా ఎంతమందికి ఎన్ని చెల్లించుకోవాలి? మీ వలన ఔతుందా? మీ బిడ్డ భవిష్యత్తుకు మీరే అడ్డు నిలుస్తారా?

ఆలోచన తోచనీయనంత నసపెడుతున్నాడు కూర్మయ్య!

"ఏమండీ? ఇలా రండి."

చాటున ఉన్న కమల పిలిచింది.

"ఏమిటి? అన్నాడు సీతాపతి లోనికి వచ్చి.

"ఆలోచించి తర్వాత వ్రాస్తామని చెప్పండి. తొందరపడకండి."

"ఊఁ."

అంటూన్న భర్తను జాలిగా చూచింది కమల. ఓటమిని వచ్చినట్లు అంగీకరించిన నీరసం ఆ కళ్ళల్లో— ఆ కంఠంలో!

విజయ్ తన గదిలోనుండి అంతా వింటున్నాడని వారికి తెలుసు.

ఏమంటాడు విజయ్?

ఒకవేళ అతడు ఔనని ఆమోదిస్తే? అందుకు తాము అంగీకారం తెల్పుతారా?

ఆటంకం తెలిపితే, 'మరి సర్వేశ్వర్రావుగారి ఒకనాటి అసమర్ధతను ఎందుకు నీవు అసహ్యించుకొంటున్నావమ్మా? నీ బిడ్డ కూడ మరికొందరి దృష్టిలో అటువంటి వాజమ్మగా కన్పట్టాలా?' అని అడగడూ?

మరి అందుకు ఝడిస్తే! ఎంత నష్టం కుటుంబానికి!

విజయ్ చదువుకు పెట్టిన ఖర్చంతా ఎలా వస్తుంది? పెండ్లి ఏ డబ్బుతో చేయాలి లహరికి? ఆమెకు అందరూ యిచ్చినట్లు తాము విపరీత కట్నకానుకలెటూ యివ్వలేము!'

"సరే, ఆలోచించుకుని వ్రాయండి."

వచ్చినవారు వెళ్ళిపోయారు.

సీతాపతి కనులలో గిర్రున తిరిగింది నీరు.

జాలిగా బాధగా చూచిన కమల కనులలో తడి!

"వాళ్ళంతా లౌకికులండీ." అన్నది కమల డగ్గుత్తికతో బాధగా.

లహరి తన మనస్సులో అన్నది బాధగా,

"లౌకికులంటే 'లౌ' తెలియనివాళ్ళు!"